సాక్షి
గుంటూరు
బుధవారం : 16 : ఏప్రిల్ : 2025





### సౌర విద్యుత్ వినియోగంపై అవగాహన

ఆత్మకూరు(మంగళగిరి): సౌర విద్యుత్ వినియోగంతో ప్రయోజనాలపై విద్యుత్ శాఖ ఏఈ మల్లికార్జునరావు వివరించారు. ఆత్మకూరులో మంగళవారం అవగాహన కల్పించారు.



### ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

పొన్నూరు: మండలంలోని నండూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ పోలేరమ్మ దేవస్థానంలో తిరునాళ్ల మంగళవారం వైభవంగా జరిగింది. ప్రభలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



### కారు బోల్తా

కొల్లూరు: కొల్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో మంగళవారం కారు బోల్తా పడింది. రేపల్లె నుంచి తెనాలి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఒకరికి గాయాలయ్యాయి.

# సఖి నివాస్‌పై సాగదీత

- గత ప్రభుత్వంలోనే సఖి నివాస్ నిర్మాణం పూర్తి
- ఉద్యోగినుల వసతి కోసం నిర్మించిన భవనం
- ఈ నెల 4న ప్రారంభించినా అందుబాటులోకి రాని దుస్థితి
- ప్రభుత్వం రుసుములు ఖరారు చేయకపోవడమే కారణం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు మహిళా ప్రాంగణంలో ఉద్యోగినుల వసతి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.27 కోట్లతో నిర్మించిన సఖినివాస్ ప్రస్తుత సర్కారు సాగదీత తీరు వల్ల ఇంకా అందుబాటులోకి రాలేదు. ఫలితంగా వసతి దొరక్క ఉద్యోగినులు అవస్థలు పడుతున్నారు. త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**2023 చివరిలోనే పూర్తి**

సఖి నివాస్(వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్) 2023 చివరిలోనే పూర్తయింది. 2024 సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అప్పట్లో ప్రారంభం కాలేదు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సఖి నివాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేయలేదు. ఆ తరువాత కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వచ్చింది. ఎన్నికల కోడ్ ఎత్తివేసిన తరువాత ఈ నెల 4న రాష్ట్ర గిరిజన సంక్షేమం, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సఖి నివాస్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అయితే హాస్టల్‌ను ఇంకా అందుబాటులోకి తీసుకురాలేదు.

## వసతి కోసం ఉద్యోగినుల వేదన



సఖి నివాస్‌కు తాళాలు వేసి ఉన్న దృశ్యం

**35 మంది దరఖాస్తు**

సఖి నివాస్‌లో ఉండేందుకు 35 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా 30 మంది ఫోన్‌లో టచ్‌లో ఉన్నారు. ప్రభుత్వం రుసుములు ఖరారు చేయనిదే హాస్టల్ నిర్వహణ సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారు. ఉద్యోగినులు నిరాశ చెందుతున్నారు.

### వసతి గదుల రెంట్ ఫిక్స్

సఖినివాస్‌లో ఏసీ, నాన్ ఏసీ కలిపి మొత్తం 19 గదులు ఉన్నాయి. వీటి అద్దె ప్రతిపాదనలను అధికారులకు ప్రభుత్వానికి పంపారు. డబుల్ షేరింగ్ ఏసీ రూమ్ 1 (అద్దె నెలకు రూ.3,500), డబుల్ షేరింగ్ నాన్ ఏసీ రూమ్ 1 (అద్దె నెలకు 2,500), సింగిల్ షేరింగ్ ఏసీ రూమ్ 2(అద్దె నెలకు రూ.4,500), ఫైవ్ షేరింగ్ ఏసీ రూమ్స్ 4(అద్దె నెలకు రూ.2500), ఫైవ్ షేరింగ్ నాన్ ఏసీ రూమ్స్ 7(అద్దె నెలకు రూ.2,000), డార్మిటరీ నాన్ ఏసీ 8 షేరింగ్ రూమ్స్ 3(అద్దె నెలకు రూ.1,500), డార్మిటరీ ఏసీ 8 షేరింగ్ రూమ్ 1(అద్దె నెలకు రూ.200)గా అధికారులు ప్రతిపాదించారు. వీటిల్లో మొత్తం 92 మంది వరకు ఉండేందుకు అవకాశం కల్పిస్తారు. అయితే ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాని కారణంగా అద్దెలు ఖరారు కాలేదు. ఫలితంగా వసతి గృహం ఇంకా అందుబాటులోకి రాలేదు. ఈ గదుల్లో ఆర్వో డ్రింకింగ్ వాటర్, గీసర్, వాషింగ్‌మెషిన్, టీవీ, బయోమెట్రిక్, సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ సౌకర్యాలు ఉన్నాయి. ఆహారానికి అయ్యే ఖర్చును ఉద్యోగినులు భరించాలి. ఈ సఖినివాస్‌లో ఉద్యోగినుల కోసం పకడ్బందీ భద్రతా చర్యలు ఉన్నాయి. హాస్టల్ నుంచి బయటకు వెళ్లేటప్పుడు, వచ్చేటప్పుడు ఫేస్ ఆధారిత బయోమెట్రిక్ ఏర్పాటు చేశారు. వీటితోపాటు సీసీ కెమెరాల నిఘాలో హాస్టల్ ఉంటుంది. వసతి గృహం నిర్వహణకు ప్రత్యేకంగా మేనేజర్, వార్డెన్, ఇద్దరు వాచ్‌మెన్లు, ఇద్దరు శానిటేషన్ సిబ్బంది ఉంటారు. వీరి నియామానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి.

### సంస్థల నుంచి లేఖ తప్పనిసరి

సఖి నివాస్‌లో వసతి కోరే ఉద్యోగినులు పని చేసే సంస్థ నుంచి లేఖలు సమర్పించాల్సి ఉంటుంది. వసతి గదుల్లో చేరే ముందు రూ.1500 అడ్వాన్స్ చెల్లించాలి. తిరిగి గది ఖాళీ చేసేటప్పుడు ఆ మొత్తం ఇస్తారు. విద్యార్థినులు కూడా ఇందులో వసతి పొందొచ్చు. అయితే సంబంధిత సంస్థల నుంచి లేఖలు సమర్పించాలి.



### ఖరారు కాగానే అందుబాటులోకి..

సఖి నివాస్‌లో మహిళా ఉద్యోగులు ఉండేందుకు ఏసీ, నాన్ ఏసీ రూమ్స్ అందుబాటులో ఉన్నాయి. వీటి అద్దె ప్రతిపాదనలను పూర్తి వివరాలతో ప్రభుత్వానికి నివేదించాం. రుసుములు ఖరారు చేస్తూ ప్రభుత్వం ఆదేశాలు రాగానే నిర్వహణ ప్రారంభిస్తాం.

– బి.రమణ శ్రీ, మహిళా ప్రాంగణం ఇన్‌చార్జి మేనేజర్



డైనింగ్ రూమ్



సింగిల్ షేరింగ్ రూమ్

### బాబూ.. రాష్ట్రాన్ని ఏం చేయదలచుకున్నావ్..?

- అదనంగా 44 వేల ఎకరాలు దేనికోసం?
- రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ చేస్తారా?
- సీఎం చంద్రబాబుపై మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రాన్ని ఏం చేయదలచుకున్నావ్ బాబూ.. అంటూ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సీఎం చంద్రబాబు తీరుపై ధ్వజమెత్తారు. రాజధాని నిర్మాణం పేరుతో ఇప్పటికే 58వేల ఎకరాలు సేకరించారని, మరలా 44వేల ఎకరాలు దేనికోసమంటూ నిలదీశారు. విజయవాడ ప్రెస్ క్లబ్‌లో మంగళవారం వడ్డే శోభనాద్రీశ్వరరావు మీడియాతో మాట్లాడారు. మళ్లీ పాత పద్ధతిలో వెళ్లొద్దంటూ చంద్రబాబుకు హితవు పలికారు. రైతులకు, రాష్ట్ర ప్రజలకు ఏం కావాలో వాటిని చేయాలని సూచించారు. సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ, పరిపాలనా వ్యవస్థలన్నింటికీ కావాల్సింది కేవలం 2700 ఎకరాలు మాత్రమేనన్నారు. తాత్కాలికం పేరుతో సెక్రటేరియట్, హైకోర్టు, అసెంబ్లీ భవనాలను నిర్మించారని, ఇప్పుడు అదనంగా మరో 44వేల ఎకరాలు తీసుకుంటామని ప్రకటించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ''రాజధాని కోసం రూ.31 వేల కోట్లు అప్పుచేశారు... ఇంకా రూ.69 వేల కోట్లు అవసరమంటున్నారు. ఇలాంటి ఆలోచనలతో ఈ రాష్ట్రాన్ని ఏం చేయాలనుకుంటున్నారో చెప్పాలి'' అని వడ్డే ప్రశ్నించారు. ప్రజలకు ఉప యోగపడేవి వదిలేసి అవుటర్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు అంటారేంటి చంద్రబాబు అని నిలదీశారు. హైపర్ లూప్ అనే రైలు అమెరికా, జపాన్, జర్మనీ వంటి దేశాల్లోనే లేదని, ఏపీలో హైపర్ లూప్ రైలుకు డీపీఆర్ సిద్ధం చేయాలని చెప్పడం చంద్రబాబు అనాలోచిత...తొందరపాటు చర్యకు నిదర్శనమని విమర్శించారు. రాజధానిలో 40 అంతస్తుల భవనాలతో ప్రజలకు ఒరిగేదేమిటని, ప్రజలకు కావాల్సింది ఎత్తైన భవనాలు కాదు.. మంచి పరిపాలన అని అన్నారు.

## న్యూస్‌రీల్

### చెన్నుని బ్రహ్మోత్సవాలలో గరుడ వాహనం



మాచర్ల రూరల్: శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి వారిని గరుడు వాహనంపై ఊరేగించనున్నారు. మంగళవారం ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి రాజగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఊరేగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాటి ప్రజల ఇలవేల్పు శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయన్నారు. భక్తులు వేలాదిగా తరలివస్తారన్నారు. ఈఓ ఎం. పూర్ణచంద్రరావు, జేఏ వీరారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు కొమెర అనంతరాములు, బండ్ల బ్రహ్మం, గాజుల గణేష్, కోమటి వీరు, మద్దిగపు శ్రీనివాసరెడ్డి, సుంకె వాసు, తదితరులు పాల్గొన్నారు.

### ఎస్సీ సంక్షేమ శాఖ డీడీగా రాజా దేబోరా

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా రాజా దేబోరా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ డీడీగా పనిచేస్తున్న డి.మధుసూదన్‌రావు 3 నెలలకు పైగా సెలవుపై వెళ్లడంతో ఇప్పటి వరకు ఏఓగా పనిచేస్తున్న మాణిక్యవరరావు ఇన్‌చార్జిగా వ్యవహరించారు. తాజాగా ఆయన స్థానంలో బాపట్ల జిల్లా ఎస్సీ వెల్ఫేర్ డీడీగా పనిచేస్తున్న రాజ్ దేబోరాకు గుంటూరు జిల్లా డీడీగా (పూర్తి అదనపు) బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


### వెబ్‌సైట్‌లో ఎస్ఏల సీనియార్టీ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్ఎం పోస్టులను ఉద్యోగోన్నతులతో భర్తీ చేసేందుకు అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లతో రూపొందించిన తాత్కాలిక సీనియార్టీ జాబితాను విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో ఉంచిన సీనియార్టీ జాబితాపై ఏమైనా అభ్యంతరాలు ఉన్న పక్షంలో ఈ నెల 20వ తేదీలోపు గుంటూరు డీఈవో కార్యాలయంలో లిఖిత పూర్వకంగా సమర్పించాలని తెలిపారు. మున్సిపల్ యాజమాన్యంలోని పాఠశాలల్లో ఉద్యోగోన్నతులకు అర్హులైన ఉపాధ్యాయులతో సీనియార్టీ జాబితాను ఇప్పటికే విడుదల చేశామని గుర్తుచేశారు.

### దుర్గమ్మ సన్నిధిలో 241 గ్రాముల బంగారం చోరీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దర్శనానికి వచ్చిన భక్తుల నుంచి 241 గ్రాముల బంగారాన్ని ఆగంతకులు చోరీ చేసిన ఘటన మంగళవారం జరిగింది. హైదరాబాద్ బృందావనకాలనీలో నివసించే అచంట దుర్గారావు కుటుంబం అమలాపురంలో జరుగుతున్న వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరారు. దుర్గమ్మను దర్శించుకునేందుకు మంగళవారం మధ్యాహ్నం విజయవాడలో ఆగారు. దుర్గగుడి ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్ సమీపంలో తమ కారు నిలిపారు. 241 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను కారులోనే ఉంచి అమ్మవారి దర్శనానికి వెళ్లారు. తిరిగి వచ్చిన తరువాత కారులో నగల బ్యాగ్ కనపడలేదు. వెంటనే సమీపంలోని పోలీసు అవుట్‌పోస్టులో ఉన్న పోలీసుల దృష్టికి విషయాన్ని తీసుకెళ్లి చుట్టు పక్కల వెతికారు. అయినా ప్రయోజనం లేకపోవటంతో మంగళవారం రాత్రి వస్తువుల ఆధారాలతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 515.20 అడుగుల వద్ద ఉంది. ఇది 140.6684టీఎంసీలకు సమానం.

# మైనారిటీలకు అండగా జగనన్న

- వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలపై మైనారిటీల్లో హర్షం
- ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ రాజకీయాలు, పార్టీలకు అతీతతంగా రాజీనామా చేయగలరా..?
- వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా



పట్నంబజారు(గుంటూరుఈస్ట్) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీలకు అన్ని వేళలా అండగా నిలబడతారని, వక్ఫ్ బిల్లుకు సంబంధించి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేయటం ద్వారా మరోసారి సుస్పష్టమైందని పార్టీ గుంటూరు నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా చెప్పారు. లోక్‌సభలో వ్యతిరేకించి.. రాజ్యసభలో మద్దతునిచ్చారని పిచ్చిపట్టిన వ్యాఖ్యలు చేస్తున్న కొంత మంది పచ్చ మీడియాకు పిటిషన్ దాఖలుతో బుద్ధి వచ్చినట్టు అయిందన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం ఫాతిమా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లిం మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్ కల్పిస్తే, జగనన్న వారికి అన్ని విధాలుగా అండగా ఉంటున్నారన్నారు. సీఎంగా ఉన్న సమయంలో ఎన్‌ఆర్‌సీని సైతం వ్యతిరేకించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. మైనారిటీల పక్షాన పోరాడుతున్న జగనన్నకు యావత్తూ మైనారిటీలు కృతజ్ఞతలు తెలుపుతున్నారన్నారు.

**ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ పార్టీలకు అతీతంగా రాజీనామా చేయగలరా...?**

గుంటూరు తూర్పు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ఎండీ నసీర్‌అహ్మద్ రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా రాజీనామా చేయగలరా అని నూరిఫాతిమా ప్రశ్నించారు. వారం క్రితం ప్రభుత్వానికి మద్దతుగా ఒక మాట చెప్పి, గత శుక్రవారం జరిగిన నిరసన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని తాను కూడా బిల్లుకు వ్యతిరేకమని చెప్పటం హాస్యాస్పదంగా ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ అసలు ఈ బిల్లు ఏవిధంగా మంచిదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఆయనకు అవేమి పట్టవని, కేవలం సీటు కోసం తాపత్రయ పడుతున్నారని, కేవలం మాట చెప్పటం కాదని.. దమ్ముంటే ఆ మాట మీద నిలబడాలని సవాల్ విసిరారు. ఎన్‌ఆర్‌సీ బిల్లుకు వ్యతిరేకంగా ఆ రోజున మాజీ ఎమ్మెల్యే మొహమ్మద్‌ముస్తఫా, పూర్తిస్థాయిలో అంశాన్ని జగనన్నకు వివరించి దానిని వ్యతిరేకించేలా చేశారని, ఇప్పుడు ఎమ్మెల్యే నసీర్ చంద్రబాబుకు చెప్పి బిల్లుకు వ్యతిరేకంగా పోరాడమని చెప్పగలరా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వానికి మైనారిటీలతో ఎటువంటి అవసరం లేదని మండిపడ్డారు. ఎమ్మెల్యే నసీర్‌అహ్మద్ బిల్లు అంశంపై డిబేట్‌కు రావాలని, తాను ఒక సాధారణ మైనారిటీ మహిళగా వస్తామని, చర్చకు సిద్ధమో కాదో చెప్పాలన్నారు. కచ్చితంగా వైఎస్సార్ సీపీ స్టాండ్ ఒక్కటేనని, వక్ఫ్ బిల్లు రద్దు చేయటమేనన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి ప్రజల కోసమే పాటుపడుతుందని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మైనారిటీ నేతలు పలువురు పాల్గొన్నారు.

## వక్ఫ్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే జియావుద్దీన్**

కొరిటిపాడు(గుంటూరు): వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ సుప్రీం కోర్టును ఆశ్రయించిన వైఎస్సార్ సీపీ ముస్లింల పట్ల అంకితభావం చాటుకుందని గుంటూరు మాజీ ఎమ్మెల్యే, మైనార్టీ వ్యవహారాల రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు ఎస్.ఎం.జియావుద్దీన్ అన్నారు. గుంటూరులోని తన కార్యాలయంలో మంగళవారం మీడియాతో మాట్లాడారు. వక్ఫ్ బిల్లు విషయంలో తెలుగుదేశం పార్టీ ద్వంద్వ విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. ముస్లింలకు మంచి చేసే సంస్థలను నీరుగార్చేలా కేంద్రంలోని బీజేపీ కుయుక్తులకు పాల్పడుతోందని దుయ్యబట్టారు. ఈ విషయంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన నేత పవన్ కల్యాణ్ ఎందుకు మౌనం వీడటం లేదని ప్రశ్నించారు. వక్ఫ్ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

## అమ్మవారికి బంగారు ఆభరణం బహూకరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారికి లండన్‌లో స్థిరపడిన తెలుగు కుటుంబానికి చెందిన వి.సీతారామి రెడ్డి పేరుతో ఆయన కుటుంబసభ్యులు 30.500 మిల్లీ గ్రాముల బంగారు నక్లెస్‌ను బహూకరించారు. మంగళవారం శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి విచ్చేసిన వారు ఆలయ అధికారికి నక్లెస్‌ను అందజేశారు. అనంతరం దాత కుటుంబసభ్యులకు అమ్మవారి దర్శనం కల్పించి వేదపండితుల ఆశీర్వచనం అందజేశారు. అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందించారు.



# పోలీస్ శాఖ ని‘శ్రేష్ట’ం

- బలహీనవర్గాలపై వివక్ష?
- ఆరునెలల్లో రెండు సార్లు సస్పెండైన ఎస్ఐ
- సీఐ ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్న ఎస్ఐపైనా వేటు
- అధికారపార్టీ సామాజికవర్గానికి రేంజ్ ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి వంత
- జిల్లాలో హాట్ టాపిక్‌గా మారిన పోలీస్‌బాస్ తీరు



లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన పోలీస్ అధికారులకు ఒక న్యాయం..బలహీనవర్గ అధికారులకు మరో న్యాయం అన్న చందాన రేంజ్ అధికారి సర్వశ్రేష్ట త్రిపాఠి వ్యవహార శైలి ఉంది. దీనిపై జిల్లా పోలీసు శాఖలో తీవ్ర చర్చ జరుగుతోంది. ఇటీవల మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను అరెస్టు చేసిన సమయంలో వేటు పడిన ఇద్దరు ఎస్ఐలూ బలహీనవర్గాలకు చెందినవారే. ఆ సమయంలో అక్కడే ఉన్న అధికార తెలుగుదేశం పార్టీ సామాజికవర్గ పోలీసు అధికారులపై మాత్రం కనీస చర్యల్లేకపోవడంపై పోలీసుశాఖలో నిరసన వ్యక్తమవుతోంది.

**ఆద్యంతం టీడీపీ సామాజికవర్గ అధికారుల కనుసన్నల్లోనే..**

మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌ను, ఆయన అనుచరులను మంగళగిరిలో అరెస్టు చేసి ముందుగా నగరంపాలెం పోలీస్ స్టేషన్ నుంచి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ సామాజిక వర్గానికి చెందిన ఎస్‌హెచ్‌ఓ వంశీధర్ వద్దకు తరలించారు. కోర్టులో హాజరు పరిచే ముందు ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అదే సామాజిక వర్గానికి చెందిన స్పెషల్ బ్రాంచ్ సీఐ అళ్లహరి శ్రీనివాస్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి ఆధ్వర్యంలో తీసుకెళ్లారు. ఆ తర్వాత కోర్టులో హాజరు పరిచే సమయంలో మాధవ్ తన అనుచరుల వద్ద ఫోన్ తీసుకుని తన లాయర్‌తో మాట్లాడుతుండగా సీఐ వీరాస్వామి దానిని లాక్కున్నారు. ఈ సమయంలో సీఐ వీరయ్యచౌదరి, స్పెషల్ బ్రాంచ్ సీఐ అళ్లహరి శ్రీనివాస్ కూడా అక్కడే ఉన్నారు. వారు మాధవ్ ఫోన్‌లో మాట్లాడుతున్నా పట్టించుకోలేదు. సీఐ వీరాస్వామి ఫోన్ లాక్కున్నారు. అయితే మాధవ్ ఫోన్ మాట్లాడుతతున్నా.. నిర్లక్ష్యంగా ఉన్నారన్న సాకుతో సీఐ వీరాస్వామితోపాటు పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు, నగరంపాలెం ఎస్ఐ రామాంజనేయులుతోపాటు 12 మందిని రేంజ్ ఐజీ సస్పెండ్ చేశారు. వాస్తవానికి అరెస్టు సమయంలో నిందితుడికి బంధుమిత్రులు, లాయర్‌తో ఫోన్‌లో మాట్లాడే హక్కుంది. అతని వద్ద ఫోన్ లాక్కునే అధికారం పోలీసులకు లేదని సీనియర్ రిటైర్డ్ పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే మాధవ్ ఫోన్ మాట్లాడుతున్నా.. చోద్యం చూసిన వారిని వదిలేసి ఫోన్ లాక్కున్న సీఐ వీరాస్వామిపై వేటు పడడం విస్తుగొలుపుతోంది. ఒక వేళ మాజీ ఎంపీ వ్యవహారంలో తప్పు జరిగినట్టు పోలీస్ బాస్ భావిస్తే మంగళగిరి నుంచి నల్లపాడు పోలీస్ స్టేషన్ వరకు ఎంత మంది పోలీసు అధికారులు ఉన్నారో అందరినీ సస్పెండ్ చేయాలి కానీ ఎస్సీ, బీసీలనే టార్గెట్‌గా చేసి సస్పెండ్ చేయడమేమిటని సిబ్బంది ప్రశ్నిస్తున్నట్టు సమాచారం.

**ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నా వేటు**

నగరంపాలెం పోలీస్ స్టేషన్ ఎస్ఐ రామంజనేయులు ఉద్యోగోన్నతి జాబితాలో ఉన్నారు. కొద్దిరోజుల్లో సీఐ కానున్నారు. దీంతో ఆయన కూడా తన తప్పు లేకుండా సస్పెన్షన్ వేటు వేశారని మనస్థాపానికి గురైనట్టు తెలుస్తోంది.

### ఆరునెలల్లో రెండోసారి సస్పెన్షన్

పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు ఆరునెలల్లో రెండోసారి సస్పెండ్ అయ్యారు. దీంతో ఆయన తన తప్పు లేకున్నా వేటు వేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నట్టు సమాచారం. దీని వల్ల తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు దారుణంగా మారతాయని బాధ పడుతున్నట్టు తెలుస్తోంది.

### వీరిపై చర్యలేవీ..

మాజీ ఎంపీ మాధవ్ సెల్‌ఫోన్ మాట్లాడిన వ్యవహారంలో 12 మందిని సస్పెండ్ చేసిన పోలీసుశాఖ టీడీపీ సామాజికవర్గానికి చెందిన మంగళగిరి ఎస్ఐ వెంకట్, కొత్తపేట సిఐ వీరయ్య చౌదరి, నల్లపాడు సీఐ వంశీధర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ అళ్ళ హరి శ్రీనివాస్‌పై ఎందుకు చర్యలు తీసుకోలేదని వెస్ట్ డీఎస్పీ ముందు సస్పెండ్ అయిన ఓ అధికారి ఆవేదన వ్యక్తం చేసినట్టు సమాచారం. బందోబస్తుకు వెళ్లి దూరంగా ఉన్న తమపై వేటు వేయడం ఏమిటని ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉంటే గతంలో అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో సస్పెండ్ అయి ఏఆర్ నుంచి సివిల్‌కు కన్వర్షన్ అయిన బలహీనవర్గాల వారిని ఆరునెలలైనా ఇంతవరకు విధుల్లోకి తీసుకోలేదు. కానీ వీఆర్‌లోకి వెళ్లిన టీడీపీ సామాజిక వర్గానికి చెందిన ఓ సీఐకి మాత్రం తుళ్ళూరు ఎస్‌హెచ్‌ఓగా వెంటనే బాధ్యతలు అప్పగించారు. ఈ వివక్ష ఎందుకో అధికారులే సమాధానం చెప్పాలి.

## చలివేంద్రానికి పోలీసు అనుమతి నిరాకరణ

పర్చూరు (చిన్నగంజాం): చలివేంద్రం ఏర్పాటు చేసేందుకు రోటరీ క్లబ్ చేసుకున్న విన్నపాన్ని పర్చూరు పోలీసులు తిరస్కరించారు. బొమ్మల సెంటర్లో చలివేంద్రం ఏర్పాటు చేస్తే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్న కారణంతో పోలీసులు అనుమతిని నిరాకరించినట్లు తెలిసింది. దీంతో పాదచారులు, ప్రయాణికులు ఎండ తీవ్రతకు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల దాహార్తిని తీర్చటానికి బొమ్మల సెంటర్లో చలివేంద్రం లేకపోవడంతో స్థానికులు కూడా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పర్చూరు రోటరీ క్లబ్ గత 23 సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలో నిస్వార్థ సేవలు అందిస్తుంది. ప్రతి సంవత్సరం వేసవి కాలంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేసి దాతల సహకారంతో 45 రోజుల పాటు మజ్జిగను కూడా అందిస్తుంది. ఈ సంవత్సరం ఎండలు మండిపోతున్నా ఇంకా చలివేంద్రం మొదలు కాక పోవడంతో స్థానికులు పలు రకాలుగా చర్చించుకుంటున్నారు. పంచాయతీ వారు అనుమతిని మంజూరు చేసినా, పోలీసులు నిరాకరించడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇన్ని సంవత్సరాల నుండి లేని ట్రాఫిక్ సమస్య ఇప్పుడే తలెత్తిందా అన్న ప్రశ్నను స్థానికులు లేవనెత్తుతున్నారు. పోలీసులు అనుమతి నిరాకరించడం వెనుక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో జోరుగా చర్చ సాగుతోంది. ఏదేమైనా వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని బొమ్మల సెంటర్లో చిన్నపాటి చలివేంద్రం ఏర్పాటుకైనా పోలీసులు అనుమతిని మంజూరు చేయాలని కోరుతున్నారు.



బొమ్మల సెంటర్లో నిలిచిపోయిన చలివేంద్రం

వాణిజ్యం

## నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **7,000** గరిష్ఠం : రూ. **10,200**

మోడల్ ధర రూ. **8,800**

## క్లుప్తంగా

### పసుపు ధరలు

**దుగ్గిరాల:** దుగ్గిరాల పసుపు యార్డులో 1,303 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 846 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10,200, గరిష్ఠ ధర రూ.12,000, మోడల్ ధర రూ.11,700 పలికింది. కాయలు 457, బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ఠ ధర రూ.10.200, గరిష్ఠ ధర రూ.12,225, మోడల్ ధర రూ.11,700 పలికింది. మొత్తం 977.250 క్వింటాళ్ల పసుపు అమ్మకాలు జరిగినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

### 1,47,684 బస్తాలు మిర్చి విక్రయం

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 1,68,585 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,47,684 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.13,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,500 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 75,504 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

### కూతురిపై లైంగిక దాడి కేసులో తండ్రి అరెస్టు

**తెనాలిరూరల్ :** కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన కీచకుడైన తండ్రిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడివాడ గ్రామానికి చెందిన వ్యక్తి తన 13 ఏళ్ల పెద్ద కుమార్తెపై ఆదివారం తెల్లవారుజామున లైంగిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితుడిని రూరల్ సీఐ ఆర్.ఉమేష్ మంగళవారం కొలకలూరు వంతెన వద్ద అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

### గాదె నాగభూషణంకు కందుకూరి విశిష్ట పురస్కారం



**తాడేపల్లి రూరల్:** మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లికి చెందిన ప్రముఖ రంగస్థల, టీవీ నటుడు, రచయిత గాదె నాగభూషణం కందుకూరి విశిష్ట పురస్కారానికి ఎంపికయ్యారు. ప్రముఖ సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు జయంతిని పురస్కరించుకుని రంగస్థల కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక కందుకూరి విశిష్ట పురస్కారాన్ని ఏప్రిల్ 16వ తేదీ బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గాదె నాగభూషణం అందుకోనున్నారు. గాదె నాగభూషణంను పలువురు కళాకారులు అభినందించారు.

# పునరావాసం కల్పించి ఇళ్లను కూల్చండి

- 40 ఏళ్ల నుంచి నివసిస్తున్నాం
- ఇళ్లను తొలగించడం అన్యాయం
- ఇన్నర్‌రింగ్‌రోడ్డు ఫేజ్–3లో ఇళ్ళు కోల్పోతున్న 200 కుటుంబాల ఆవేదన



స్వర్ణభారతి నగర్‌లో ఇళ్లు తొలగించిన దృశ్యం

**గుంటూరు రూరల్:** ఇన్నర్ రింగ్‌రోడ్డు ఫేజ్ 3 నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో 41వ డివిజన్ స్వర్ణభారతినగర్‌లో సుమారు 200 ఇళ్లను అధికారులు ఎటువంటి సమాచారం లేకుండా తొలగిస్తున్నారు. దీంతో ఇళ్లు కోల్పోతున్న బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 ఏళ్ళ నుంచి ఇక్కడ ఇళ్లు కట్టుకుని ఉంటున్నామని, కూలీనాలీ చేసుకుని బతుకుతున్నామని పేర్కొంటున్నారు. అధికారులు ఉన్నపళంగా ఇళ్లను కూలిస్తే ఏం చేయాలని కన్నీరుమున్నీరవుతున్నారు. తమకు పూర్తి పునరావసం కల్పించి ఇళ్లను కూల్చాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఇళ్ళను పొక్లెయిన్లతో కూల్చి వేస్తున్న క్రమంలో అడ్డుకున్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. దీంతో స్థానికులు పునరావాసం కల్పించి న్యాయం చేయాలని కలెక్టర్, కమిషనర్, నగర మేయర్‌కు వినతిపత్రాలు అందించారు. పిల్లాపాపలతో రోడ్డున పడతామని, కాస్త కనికరం చూపి న్యాయం చేయాలని వేడుకున్నారు.

### కూలీనాలీ చేసుకుని బతికేవాళ్లం



40 ఏళ్ళుగా ఇక్కడ గత ప్రభుత్వాలు ఇచ్చిన స్థలంలో ఇల్లు నిర్మించుకుని కూలీనాలీ చేసుకుని జీవిస్తున్నాం. ఇప్పుడు ఒక్కసారిగా వచ్చి ఇళ్ళను కూల్చేస్తున్నారు. పునరావాసం కల్పించి ఇళ్లు కూల్చుకోవాలని చెబుతున్నాం. అయినా పట్టించుకోవడం లేదు. ఇల్లు కూల్చేశారు. ఇప్పుడు పిల్లలతో కట్టుబట్టలతో ఎక్కడికి వెళ్లాలి? పోలీసులను పెట్టి బెదిరిస్తున్నారు.

– జిల్లా సత్యవతి, స్థానికురాలు, బాధితురాలు

### మాకు దిక్కెవరు?



మా అమ్మనాన్నలు బతికుండగా 30 ఏళ్ళ క్రితం కూలీనాలీ చేసి ఇల్లు కట్టారు. అందులో అమ్మనాన్న, మా చెల్లి నేను కూలీ పనులు చేసుకుని జీవిస్తుండేవారం. రెండేళ్ళ క్రితం మా అమ్మనాన్నలు అనారోగ్యంతో మరణించారు. ప్రస్తుతం మా చెల్లితో నేను ఇక్కడే ఇంట్లో తలదాచుకుంటూ ఇద్దరం కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. ఇప్పుడు అధికారులు ఇల్లు కూల్చేశారు. మాకు దిక్కెవరు లేరు. అధికారులు పట్టించుకోవటంలేదు. మమ్మల్ని ఆదుకోండి.

– పాతకోటి కృష్ణబాబు, బాధితుడు

### పునరావాసం కల్పించిన తర్వాతే ఇళ్లను కూల్చాలి



సుమారు 200 కుటుంబాలు ఇళ్ళను కోల్పోతున్నారు. వారికి పూర్తి పునరావాసం కల్పించాలి. లేదా ప్రస్తుతం ఎక్కడో ఒక చోట తలదాచుకునేందుకు వసతి కల్పించాలి. ప్రభుత్వమే అద్దె చెల్లించాలి. వారిని ఆదుకోవాలి. ఇళ్లకు నష్టపరిహారం ఇవ్వాలి. న్యాయం చేయాలి. లేకుంటే పోరాటం తప్పదు.

–పిల్లి మేరి, స్థానికురాలు, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్

## తెనాలి కళాకారులు ఐదుగురికి 'కందుకూరి' పురస్కారాలు



గుమ్మడి విమలకుమారి | ఆరాధ్యుల ఆదినారాయణ | సురభి ప్రభావతి | గోపరాజు విజయ్ | అయినాల మల్లేశ్వరరావు

**తెనాలి:** ప్రఖ్యాత నాటక రచయిత, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతి రోజున ఆయన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం బహూకరించనున్న ప్రతిష్ఠాత్మక కందుకూరి వీరేశలింగం అవార్డును రాష్ట్రంలోని ముగ్గురు కళారంగ ప్రముఖులు ఎంపికయ్యారు. వీరిలో తెనాలికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు ఆరాధ్యుల వెంకటేశ్వరరావు ఒకరు. కందుకూరి వీరేశలింగం జిల్లా అవార్డుకు గుంటూరు జిల్లా నుంచి 12 మంది ఎంపికకాగా, వీరిలో ఐదుగురు తెనాలికి చెందిన నటీనటులున్నారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మంగళవారం సాయంత్రం ఈ అవార్డులను ప్రకటించింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం సాయంత్రం ఆరుగంటలకు ఏర్పాటయే వేడుకలో జిల్లాస్థాయి అవార్డులకు ఎంపికైన కళాకారులకు రూ.10 వేల చొప్పున నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేసి, సత్కరిస్తారు. ఎంపికైన వారిలో పట్టణానికి చెందిన ప్రముఖ పౌరాణిక పద్యనాటక నటీమణి, పురుషపాత్రల్లో నటించిన ప్రతిభాశాలి గుమ్మడి విమలకుమారి ఉన్నారు. ప్రముఖ పౌరాణిక నటుడు, శ్రీదుర్గాభవానీ నాట్యమండలి వ్యవస్థాపకుడు ఆరాధ్యుల ఆదినారాయణ కూడా జిల్లా అవార్డుకు ఎంపికయ్యారు. కొలకలూరుకు చెందిన శ్రీసాయి ఆర్ట్స్ సమాజంతో నాటకరంగ ప్రయాణం చేస్తూ, ప్రస్తుత అటు నాటకాల్లో, ఇటు సినిమాలు ముమ్మరంగా నటిస్తున్న సురభి ప్రభావతి, శ్రీసాయి ఆర్ట్స్ సమాజం దర్శకుడు, నటుడు, సినీనటుడు గోపరాజు విజయ్, పట్టణానికి చెందిన జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుగ్రహీత, పద్యకవి, నటుడు డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు కందుకూరి అవార్డులను స్వీకరించనున్నారు.

## వీఆర్వోల సంఘ సమావేశం జరగనీయకుండా అడ్డుకున్నారు

**గుంటూరు మెడికల్:**ఏపీఆర్ఎస్ఏ, ఏపీ జేఏసీ అమరావతిపై గతంలో చేసిన ఆరోపణలపై బహిరంగ క్షమాపణ చెప్పినట్లు సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు జిల్లాలో రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని వారం రోజుల క్రితమే నిర్ణయం తీసుకుని, జిల్లాపరిషత్ అధికారులను మీటింగ్ హాలు ఇవ్వాలని అడిగామని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న ఏపీఆర్ఎస్ఏ నాయకులు తమ సంఘ సమావేశం జరగనీయకూడదని జిల్లాపరిషత్ మీటింగ్ హాలు తమకు ఇవ్వకుండా కుట్ర చేశారని విమర్శించారు. గుంటూరు ఏపీ ఎన్జీవో కల్యాణ మండపంలో ఈనెల 15న సమావేశం ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఆ సమావేశాన్ని కూడా వీఆర్వో సంఘం అని చెప్పుకుంటూ తిరుగుతున్న ఆపేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

## ఆధారాలు చూపిస్తే ధర్మకర్తగా తప్పుకుంటా..

మస్తాన్ దర్గా ధర్మకర్త రావి రామోహన్‌రావు



**లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్):** వక్ఫ్ బోర్డు అధికారులు అన్ని ఆధారాలూ చూపిస్తే ధర్మకర్తగా తప్పుకునేందుకు అభ్యంతరం లేదని హజ్రత్ మస్తాన్ షా వలి దర్గా ధర్మ కర్త రావి రామోహన్‌రావు (దర్గా రాము) అన్నారు. స్థానిక నగరంపాలెంలోని హజ్రత్ కాలేషా మస్తాన్ వలి దర్గా ప్రాంగణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మస్తానయ్య దర్గాను తమకు అప్పగించాలని వక్ఫ్ బోర్డు అధికారులు తమపై ఒత్తిడి తెస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హజరత్ కాలే మస్తాన్ షా ఔలియా సంరక్షణ బాధ్యతలు తమ పూర్వీకుల నుంచి నిర్వహిస్తున్నామని చెప్పారు. దర్గా వక్ఫ్ పరిధిలోకి రాదని 1892లోనే మద్రాస్ కోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు. 2000 సంవత్సరంలో గుంటూరు జిల్లా కోర్టు మస్తానయ్య దర్గా వక్ఫ్ పరిధిలోకి రాదని చెప్పినట్లు వెల్లడించారు. ఇప్పుడు ఏ విధంగా వక్ఫ్ బోర్డు సభ్యులు దర్గాను స్వాధీనం చేసుకోవాలని చూస్తున్నారో అర్థం కావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దర్గా వక్ఫ్ పరిధిలో ఉన్నట్లుగా తమకు ఆధారాలు చూపిస్తే ధర్మకర్తగా తప్పుకొని వారికి అప్పగించేందుకు అభ్యంతరం లేదని చెప్పారు. అనంతరం రావి రామోహన్‌రావు సతీమణి విలేకరులతో మాట్లాడారు.

# వాసవీ కన్యక గుడి సత్రం కమిటీ ఎన్నిక

- కొత్త అధ్యక్షునిగా వెంకట్రావు ఎన్నిక
- పోలీసు బందోబస్తు నడుమ ఆలయ ఆఫీసు తాళం పగలగొట్టి స్వాధీనం



నూతన అధ్యక్షుడు పెండేల వెంకట్రావు, కార్యదర్శి తాతా శ్రీనివాసరావు, ఇతర పాలకవర్గం

**తెనాలి:** పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ వివాదాస్పదంగా మారిన తరుణంలో మంగళవారం కొత్త కమిటీని ప్రకటించారు. విస్తృత పోలీసు బందోబస్తు నడుమ నూతన అధ్యక్షుడిగా తనను ఎన్నిక చేసుకున్నట్టు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు ప్రకటించారు. వాస్తవానికి కమిటీ సర్వసభ్య సమావేశం జరగాల్సిన ఈనెల 13వ తేదీనే సభ్యులు తనను ఎన్నుకున్నారనీ, ఈరోజు సమావేశంలో ప్రకటన చేస్తున్నట్టు పెండేల వెంకట్రావు తెలియజేశారు. దేవస్థానం ఆఫీసు తాళం పగులగొట్టి స్వాధీనం చేసుకున్నారు. దేవస్థానం సత్రం కమిటీ సర్వసభ్య సమావేశం ఈనెల 13న జరగాల్సి వున్న విషయం తెలిసిందే. ఆరోజు వివాదం నెలకొనటం, ఇరువర్గాల సభ్యులతోపాటు బయట వ్యక్తుల ప్రవేశంతో ఆలయ ప్రాంగణంలో ఉద్రిక్తత నెలకొంది. అదేరోజు నూతన కమిటీ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నామని, తదుపరి తేదీని ప్రకటిస్తామని కమిటీ నాయకులు ప్రకటించారు. ఆ ప్రకారం పత్రికా ప్రకటన చేశారు. మరోవైపు సత్రం కమిటీ కాలపరిమితి పూర్తయిందనీ, మార్చాల్సిందేనని పట్టుబట్టిన సభ్యులు 300 మందికి పైగా, 13వ తేదీనే తనను నూతన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పెండేల వెంకట్రావు మీడియాకు వెల్లడించారు. ముందు ప్రకటించిన ట్లుగా మంగళవారం ఆయన వర్గం సభ్యులు ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. సత్రం కమిటీ నాయకులూ హాజరయ్యారు. ముందస్తు జాగ్రత్తగా సబ్‌డివిజనులోని పోలీసులను ఇక్కడ మోహరించారు. గుంటూరు నుండి అదనపు ఎస్పీ స్వయంగా వచ్చి పర్యవేక్షించారు. ఏకపక్షంగా నూతన కార్యవర్గాన్ని ప్రకటించుకోవటంతో కమిటీ నాయకులు బయటకు వెళ్లిపోయారు. అనంతరం పెండేల వెంకట్రావు తన ఎన్నిక విషయాన్ని వెల్లడించారు. కార్యదర్శిగా తాతా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బచ్చు సాంబశివరావు, సంయుక్త కార్యదర్శిగా పెండేల సుబ్బారావు, కోశాధికారిగా శ్రీరాం రాజా, సభ్యులుగా నూకల రాధాకృష్ణమూర్తి, కొప్పురావూరి కిశోర్, మువ్వల సుబ్బారావు, డోగిపర్తి చంద్రశేఖర్, చందోలు రమేష్‌బాబు, మాజేటి కృష్ణకిశోర్, కొల్లిపర రాధాకృష్ణమూర్తి, దేసు యుగంధర్, దేసు రవికుమార్, కూరపాటి రవికుమార్, మానేపల్లి చంద్రశేఖర్, తవ్వా నాగప్రసాద్ ఎన్నికైనట్టు ప్రకటించారు. నూతన కార్యవర్గం కాలపరిమితి 2025–28 వరకు ఉంటుందని తెలిపారు. గతంలో సీనియర్ రాజకీయవేత్త కొణిజేటి రోశయ్య సూచనపై నూకల వెంకట వేణుగోపాలరావుకు కమిటీ అధ్యక్షుడిగా అవకాశం ఇచ్చామని, గత ఇరవై ఏళ్లుగా ఆయన ఎన్నో దురాగతాలకు పాల్పడినందునే పోరాటం చేసి మార్చుకోవాల్సి వచ్చిందని పెండేల వెంకట్రావు అన్నారు. దేవస్థానం ఆఫీసు తాళం పగులగొట్టి, కొత్త తాళం వేశారు. నూతన కమిటీని హాజరైన సభ్యులు శాలువాలతో సత్కరించారు. సర్వసభ్య సమావేశం జరగటం, అందులో ఏకగ్రీవం చేసుకోవటం లేదా ఎన్నిక అనివార్యమైతే తేదీని ప్రకటించి ఎన్నికలు జరుపుకోవటం వంటి అంశాల జోలికి పోకుండా వెయ్యిమంది సభ్యులున్న ఆలయ కమిటీపై విస్తృత పోలీసు బందోబస్తు నడుమ అతి సునాయాసంగా ఆధిపత్యం సాధించటం పట్టణంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

## విద్యుత్ విజిలెన్స్ అధికారుల దాడులు

రూ.8.52 లక్షలు అపరాధ రుసుం వసూలు



వివరాలను వెల్లడిస్తున్న విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వెంకటేశ్వరరావు

**కొరిటెపాడు(గుంటూరు):** గుంటూరు డీ–5 సెక్షన్, ఆర్టీసీ బస్టాండ్, పాత గుంటూరు, బాలాజీ నగర్, సుద్దపల్లి డొంక, ప్రగతినగర్‌లలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో 59 బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు, శ్రీనివాసబాబు మాట్లాడుతూ తక్కువ లోడ్‌కు సర్వీసు తీసుకొని అదనపు లోడు వాడుతున్న 140 సర్వీస్‌ల కింద రూ.4.83 లక్షలు, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న ఐదుగురికి రూ.2.19 లక్షలు, అనుమతించిన కేటగిరి కాక ఇతర కేటగిరిలో విద్యుత్ వాడుకుంటున్న ఇద్దరికి రూ.లక్ష, అసలైన వాడకం కంటే బిల్లు తక్కువగా ఇవ్వబడిన రెండు సర్వీసులు గుర్తించి రూ.50 వేలు మొత్తం రూ.8.52 లక్షలు అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహావసరాలకు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని, విద్యుత్ మీటర్లు తిరగకుండా చేస్తే అటువంటి వాటిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులకు 9440812263, 9440812360, 9440812361 నంబర్లకు నేరుగా లేదా వాట్సప్ ద్వారా సంప్రదించవచ్చు అని వారు వెల్లడించారు. దాడుల్లో డీఈఈలు కె.రవికుమార్, ఎస్.మల్లికార్జున ప్రసాద్, పీహెచ్ హుస్సేన్‌ఖాన్, ఏఈలు కె.కోటేశ్వరరావు, ఎ.చంద్రశేఖర్, ఎం.సతీష్‌కుమార్, యు.శివశంకర్, షేక్ మస్తాన్‌వలి తదితరులు పాల్గొన్నారు.

## కీబోర్డులో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన నులకపేట విద్యార్థి



తల్లిదండ్రులతో చల్ల వ్యూహిత

**తాడేపల్లి రూరల్ :** స్థానిక నులకపేటకు చెందిన ఓ విద్యార్థిని మ్యూజికల్ కీ బోర్డులో రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్‌లో స్థానం సంపాదించింది. మంగళవారం గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్సు సంస్థ సర్టిఫికెట్‌ను అందసింది. నులకపేటకు చెందిన చల్లా కరుణాకర్ రెడ్డి, ఉషశ్రీ దంపతుల కుమార్తె చల్ల వ్యూహిత కేంద్రీయ విద్యాలయ గుంటుపల్లి కేవీ2లో 10వ తరగతి చదువుతోంది. ఇన్‌స్టాగామ్‌లో ఒక గంటలో అత్యధికంగా 1,046 కీబోర్డు వాయిద్యం వీడియోలు అప్‌లోడ్ చేసి అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఆంధ్రప్రదేశ్, విజయవాడలోని మిస్టర్ అగస్టీన్ దండింగి వేణుగోపాల్, హోలెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా డిసెంబర్ 1, 2024న ఈ ఘనతను సాధించింది.



## కిల్కారీతో గర్భిణులు, బాలింతలకు బహుళ ప్రయోజనాలు



ఆశాలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

**గుంటూరు మెడికల్ :** కేంద్ర ప్రభుత్వం కిల్కారి కార్యక్రమాన్ని గర్భిణులు, బాలింతల కోసం ప్రవేశపెట్టిందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. మంగళవారం గుంటూరు డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆశా నోడల్ ఆఫీసర్స్ సమావేశం జరిగింది. సమావేశంలో కిల్కారి ప్రోగ్రామ్ గురించి వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణికి నాలుగో నెల మొదలుకొని బిడ్డకు ఒక ఏడాది వచ్చే వరుకు కిల్కారి ఫోన్ కాల్స్ వస్తాయని చెప్పారు. వాయిస్ కాల్స్ ద్వారా తల్లీ, బిడ్డల ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందజేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి కాల్ నంబర్ 01244451660ను ప్రవేశపెట్టినట్లు వెల్లడించారు. ఈ నంబరును గర్భిణి తన మొబైల్‌లో సేవ్ చేసుకుంటే వారికి కాల్ వచ్చినపుడు పూర్తిగా సమాచారాన్ని వినవచ్చు అన్నారు. తొలిసారి విన్న సమాచారంలో ఏమైనా సందేహాలు ఉంటే తిరిగి ఆ సమాచారాన్ని వినేందుకు 14423 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వినవచ్చు అన్నారు. కిల్కారి సేవలను గర్భిణి, బాలింతలు ఉపయోగించుకోవాలని డాక్టర్ విజయలక్ష్మి కోరారు. జిల్లాలో కిల్కారి లో బాగా పనిచేసిన ఆశలకు డాక్టర్ విజయలక్ష్మీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణబాబు, ఎన్‌సీడీ జిల్లా ప్రొగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డీపీఎంహెచ్ఎస్ఓ ప్రియాంక, హెచ్ఈఈఓ చంద్రశేఖర్, కిల్కారి రాష్ట్ర ప్రోగ్రాం మేనేజర్ ఎల్.రాజు, సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

## విజ్ఞాన్‌ను సందర్శించిన యూఎస్‌ఏలోని గానన్ వర్సిటీ ప్రతినిధి



ప్రొఫెసర్ అగర్వాల్ మహేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

**చేబ్రోలు:** వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీని యూఎస్ఏలోని గానన్ యూనివర్సిటీ ప్రతినిధి ప్రొఫెసర్ డాక్టర్ సి.అగర్వాల్ మహేష్ మంగళవారం సందర్శించారు. స్కూల్ ఆఫ్ కోర్ ఇంజినీరింగ్ విభాగంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, ఆఫీస్ ఆఫ్ ఐక్యూఏసీల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ప్రొఫెసర్ డాక్టర్ సి.అగర్వాల్ మహేష్‌తో విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విజ్ఞాన్ వర్సిటీ, యునైటెడ్ స్టేట్స్‌లోని గానన్ యూనివర్సిటీ మధ్య మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో విద్యా, పరిశోధనా రంగాల్లో సహకారాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో మూడు ముఖ్యమైన కార్యక్రమాలను ప్రారంభించామన్నారు. అందులో ఫ్యాకల్టీ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్, ''కొలాబొరేటివ్ హరైజన్స్: జాయింట్ రీసెర్చ్ ఇనిషియేటివ్స్'', మరియు ట్విన్నింగ్ డిగ్రీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమాల ద్వారా అధ్యాపకులు పరస్పర విజిట్లు చేయడం ద్వారా నూతన బోధనా పద్ధతులు, పరిశోధనా పరిజ్ఞానాన్ని పంచుకుంటున్నారని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా విద్యా, పరిశోధన, సాంకేతిక పరస్పర మార్పిడితో పాటు, విద్యార్థులకు గ్లోబల్ ప్రొఫెషనల్ ప్రొఫైల్ అభివృద్ధి చేసే అవకాశాలు విస్తరించనున్నాయని తెలియజేసారు.

## చెత్త నుంచి సంపద సృష్టిపై దృష్టి పెట్టాలి



**పెదకాకాని:** చెత్త నుండి సంపద సృష్టించడంపై దృష్టి సారించాలని గుంటూరు జిల్లా డీపీఓ నాగసాయి కుమార్ అన్నారు. పెదకాకాని గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు వద్ద జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో డీపీఓ పాల్గొన్నారు. డీపీఓ మాట్లాడుతూ జిల్లాలో పది వేలకు పైగా జనాభా ఉన్న పది గ్రామాలను ఎంపిక చేసి సంపద సృష్టిపై దృష్టి సారించనున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగా పెదకాకాని మండలంలోని పెదకాకాని, నంబూరు గ్రామాలను ఎంపిక చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమావత్ శ్రీనివాసరావు, ఈఓపీఆర్డీ కెల్లంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కుటుంబ సంబంధాలు భేషన్న నాటికలు



'విడాకులు కావాలి' నాటికలో సన్నివేశం

**తెనాలి:** డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్మారక నాటక కళాపరిషత్, తెనాలి ఆధ్వర్యంలో ఇక్కడి రామలింగేశ్వరపేటలోని ఓపెన్ ఆడిటోరియంలో జరుగుతున్న జాతీయస్థాయి చతుర్థ ఆహ్వాన నాటికల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. నాలుగోరోజైన మంగళవారం ప్రదర్శించిన నాటికలు కుటుంబ సంబంధాల ప్రాధాన్యాన్ని చాటాయి. తొలుత అరవింద ఆర్ట్స్, తాడేపల్లి వారి 'విడాకులు కావాలి' నాటికను ప్రదర్శించారు. దాంపత్య జీవితంలో దంపతుల మధ్య అభిప్రాయభేదాలు, చిన్న సమస్యలు తలెత్తటం సహజం, అంతమాత్రాన కలసి బతకలేమన్న తొందరపాటుతో, పంతాలకు పోయి విడాకులు కావాలనుకోవటం ఎంతవరకు సమంజసం అనే అంశాన్ని చర్చించిందీ నాటిక. భారతీయ వివాహ వ్యవస్థలో మన సంస్కృతి, సంప్రదాయాలే సాంసారిక జీవితాలను అన్యోన్యంగా నడిపే దారిదీపాలనీ, ఇచ్చిపుచ్చుకునే సంస్కారం దాంపత్యాన్ని ఆనందమయం చేస్తుందన్న సందేశాన్ని చాటిందీ నాటిక. ప్రముఖ నాటక రచయిత వల్లూరు శివప్రసాద్ రచించిన నాటికను గంగోత్రి సాయి దర్శకత్వంలో ప్రదర్శించారు. అనంతరం ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి 'కిడ్నాప్' నాటికను ప్రదర్శించారు. కుటుంబ వ్యవస్థ గొప్పతనాన్ని తెలియజెప్పిందీ నాటిక. స్వార్థజీవనానికి అలవాటు పడుతున్న యువత తల్లిదండ్రులను దూరంగా ఉంచుతున్న తీరును కళ్లకు కట్టారు. వందలకొద్దీ పుస్తకాలు చదివితే వచ్చే విజ్ఞానం, మన ఇళ్లలోని పెద్దవాళ్లు చెప్పే మాటలతోనే వస్తుందని పాత్రలతో చెప్పించారు. చెరుకూరి సాంబశివరావు రచించిన ఈ నాటిక ప్రదర్శనకు ఆయనే దర్శకత్వం వహించారు. చివరగా శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్, గుడివాడ వారి 'అనశ్వరం' నాటికను ప్రదర్శించారు. బల్లె సత్యనారాయణ రచించిన నాటికకు ద్వాదశి చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. తొలుత శవ్వా గ్రీష్మశ్రీ కూచిపూడి నృత్యప్రదర్శన ఆహుతుల అభినందనలు అందుకుంది. తెనాలి కళాకారుల సంఘం నిర్వహణలో జరుగుతున్న ఈ నాటికల పోటీలను గౌరవాధ్యక్షుడు ఆరాధ్యుల కన్నా, అధ్యక్షుడు అద్దేపల్లి లక్ష్మణశాస్త్రి, కార్యదర్శి పిట్టు వెంకటకోటేశ్వరరావు పర్యవేక్షించారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న ప్రభుత్వ కళాశాల విద్యార్థిని



సర్వేపల్లి రాజేశ్వరికి ల్యాప్‌టాప్ బహుకరిస్తున్న మంత్రి లోకేష్, పక్కన తల్లిదండ్రులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** ఇటీవల విడుదలైన ఇంటర్మీడియెట్ ఫలితాల్లో గుంటూరులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి ఎంఈసీ విభాగంలో 967 మార్కులతో టాపర్‌గా నిలిచిన విద్యార్థిని సర్వేపల్లి రాజేశ్వరిని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి షైనింగ్ స్టార్ అవార్డుతో పాటు ల్యాప్‌టాప్ బహూకరించారు. ప్రభుత్వ కళాశాలల విభాగంలో ఎంఈసీ గ్రూప్‌లో గుంటూరు జిల్లా నుంచి అత్యధికంగా మార్కులు సాధించిన సర్వేపల్లి రాజేశ్వరి జలగం రామారావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలో చదివి, టెన్త్‌లో 568 మార్కులు సాధించింది. జూనియర్ ఇంటర్‌లో 500 మార్కులకు 485, తాజాగా సీనియర్ ఇంటర్లో 967 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచింది.